
ఈ రోజు కూడా బాబు అలానే ఏడ్చాడా?

మధ్యాహ్నం లంచ్‌కి ఇంటికొచ్చినప్పుడు అడిగాడు మురళి.

బాబు వంశీ మంచి నిద్రలో వున్నాడు. ముఖమంతా కందిపోయి, ఏడ్చి ఏడ్చి కళ్ళు ఉబ్బిపోయినట్లుగా వున్నాయి.

# కొత్తరూపం



'ఔవండీ, వాడి వచ్చీరాని భాషలో ఏదో అంటాడు!' చెప్తోంది వీణ.

"అద్దూ, అమ్మా, అద్దూ' నిద్రలో కలవరిస్తూ అనీజీగా అటూ ఇటూ కదులుతున్నాడు వంశీ.

"ఎప్పటిదాకా ఏడ్చాడు?" అడిగాడు మురళి.

"మీరున్నంతసేపూ నా దగ్గరకి రానవి మీ దగ్గరే వున్నాడా? తర్వాత వాడేదుస్తూవే వున్నాడు అద్దూ, అద్దూ అంటూ. ఏమి వద్దో ఏమిటో. నాకే విసుగొచ్చి పాపం, వాణ్ణి ఒక్కటి వాయించి, అలాగే వదిలి స్నానంచేసి వచ్చాను. ఆ తర్వాత ఏడుపు ఆపేశాడు. హాయిగా అన్నం తిని వెంటనే నిద్రపోయాడు, పిచ్చి వెధవ" చెప్తుంటే వీణకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

రెండు రోజుల నుంచీ ఇదే వరస. వీణని ఒక్క నిముషం కూడా వదలని వాడు, సాయంత్రం అవుతూనే అమ్మ వద్దూ, నాన్న, నాన్నా అంటూ మురళిని వదలడంలేదు. వీణ ఎంత దగ్గరికి తీసుకున్నా రాడే. ఒకవేళ తండ్రి వున్నంతసేపూ తండ్రి దగ్గర వుండాలన్న కోరికేమో! కానీ అతని దగ్గర వున్నా ఏదో 'అనీజీ'గా కుళ్ళుతూనే వుంటాడు. కడుపులో ఏమన్నా బాధగా వుందేమో!

ఈ రోజు అలానే చేస్తే రేపు డాక్టర్లు దగ్గరకి తీసుకెళ్దాం అని ఒక నిశ్చయానికి వచ్చారిద్దరూ.

వంశీకి రెండు సంవత్సరాలు దాటాయి. మాటలు అప్పుడప్పుడే వస్తున్నాయి. మనసులోనిది చెప్పకోలేని వయసు. తల్లే అర్థం చేసుకొని సమర్థించాల్సిన వయసు. అలాంటిది అసలు తల్లినే వద్దూ, వద్దూ అంటున్నాడేమిటి? వీణ మనసంతా అలజడిగా వుంది. పెళ్ళైన ఎనిమిదేళ్ళకు లేక లేక కలిగిన బిడ్డాయె. కళ్ళలో వత్తులేసుకుని పెంచుకొస్తోంది. మరో సంవత్సరంలో స్కూలుకి పంపించాలని ఇష్టమ్నుంచే దిగులు పడుతోంది. సాయంత్రం ఔతోందంటేనే దిగులుగా వుంది.

సాయంత్రమైంది. ఐదు గంటల కల్లా వాడికి స్నానం చేయించి ముస్తాబు చేసింది. మరో గంట కల్లా మురళీ రానే వుచ్చాడు. ఫ్రెష్‌గా వున్న వాడి ముఖాన్ని చూసి తృప్తిగా నిట్టూర్చాడు.

మురళీ స్నానం చేసి, రిఫ్రెష్ అయిన తర్వాత బాబుని అప్పగించి తను స్నానానికి వెళ్ళింది.

తెల్లటి తెలుపు మీద చిన్న చిన్న గులాబీ పూలు డిజైన్ వున్న నైటీ, షాంపూ చేసిన పొడవాటి జుట్టు రబ్బర్‌బాండ్‌లో బిగించి, విరజాజుల మాల తురుముకుంటూ బయట కొస్తున్న వీణ తెల్లగులాబీలా కనిపించింది మురళీ కళ్ళకు.

ఒక్క క్షణం బాబు వైపు చూశాడు.

బ్యాట్ పట్టుకొని సీరియస్‌గా క్రికెట్ ఆడుతున్నాడు.

గభాల్న భార్య వైపు వచ్చాడు మురళి.

బాల్ కొట్టలేకపోయినట్లున్నాడు, అమ్మా బాయి, అమ్మా బాయి (బాల్) అంటూ తల్లి వైపు వస్తున్న వాడల్లా మళ్ళీ సడన్‌గా ఏడుపు మొదలెట్టాడు.

వీణ మురళిని తప్పించుకుని వంశీ వైపు నడిచింది. వాడు వెంటనే పెద్దగా రాగం మొదలెట్టాడు 'నాన్నా' అంటూ.

వీణ ఎత్తుకోంగానే తోసేస్తూ వద్దూ వద్దూ అంటున్నాడు.

మురళీ తీసుకున్నాడు వాడ్ని. వీణ వైపుగా చూపిస్తూ "అమ్మో! వద్దూ" అంటున్నాడు. వెనుకగానీ ఏమన్నా చూసి భయపడుతున్నాడా అని వెనక్కి తిరిగి చూసింది. బయటంతా చీకటి. ఏమన్నా కనిపించిందేమో చీకట్లో అనుకుంటూ బాబు వైపు వస్తూంటే వాడు పెద్దగా వద్దూ అని ఏడుపు పెంచడంతో గబగబా బెడ్‌రూంలోకి పరిగెత్తి బెడ్ మీద పడిపోయింది వీణ.

ఎంత ఆపుకుందామన్నా ఆగని దుఃఖం.

బాబుని సముదాయించి, వాణ్ణి హాల్లోనే

వదలి లోపలికొచ్చాడు మురళి.

"ఏయ్ పిచ్చీ, ఏమిటిది చిన్న పిల్లలా? పిల్లలన్నాక చిన్న చిన్న ప్రాబ్లమ్స్ రావా ఏమిటి? కడుపు నెప్పి లాంటిదేమన్నా వుండీ వుండీ వస్తోందేమో, నువ్వైతే మందు వేస్తావని అమ్మ వద్దూ అంటున్నాడో, లేకపోతే ఎందుకైనా భయపడ్డాడో, నువ్వేదిస్తే వాడి బాధ తగ్గదు కదా? లేచి రడీ కా, బాబు నిప్పుడే హాస్పిటల్‌కి తీసుకెళ్దాం" అంటూ బాబు దగ్గరకెళ్ళాడు.

వీణ లేచి గబగబా రడీ అయింది.

అంతలోనే మళ్ళీ మామూలుగా ఐపోయాడు వంశీ. 'అమ్మా' అంటూ పరుగెత్తుకొచ్చి వీణ కాళ్ళను చుట్టేశాడు.

గభాల్న బాబు నెత్తుకుని హృదయానికి హత్తుకుంది. ఇంత చిట్టి తండ్రికి ఏమి కష్టమో అనుకొంటుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి వీణకి.

"వీణా! రా" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు మురళి.

* * *

రాత్రి ఇల్లు చేరేసరికి దగ్గర దగ్గర పదైంది.

అవసరమో కాదో గానీ ఏవేవో టెస్టులు చేసి బాబు చాలా ఆరోగ్యంగా వున్నాడు, మరేం భయం లేదన్నాడు డాక్టరు.

మరెందు కేడుస్తున్నట్లు?

ఆ మర్నాడు మోషన్ కూడా టెస్టు చేసి మందులు రాస్తానన్నాడు డాక్టర్. రాత్రికి నిద్రపోకపోతే వెయ్యమని మందు రాసిచ్చాడు.


కానీ ఇల్లు చేరేసరికి వాడు గాఢ నిద్రలో వున్నాడు.

నిద్రలోనే పాలు పట్టేసి, పడుకోబెట్టింది వీణ. డ్రస్ ఛేంజ్ చేసి, నైటీవేసుకొని దిగులుగా మంచం మీద వాలి, దేముణ్ణి ప్రార్థిస్తూ నిద్రలోకి జారుకుంది.

* * *

మర్నాడు లేస్తూనే మళ్ళీ అదే లాంటి ఏడుపు. మురళీ వుండగానే పనంతా ముగించుకొందామని గబగబా స్నానం చేసి రెడీ అయిపోయింది వీణ.

చిత్రంగా ఏడుపు మానేసి, మళ్ళీ సంతోషంగా అమ్మ దగ్గరకొచ్చేసి కుచ్చెళ్ళలో ముఖం దాచుకుంటున్నాడు వంశీ.



ముగ్గు: అన్నపూర్ణ, తిరుపతి

వాణ్ణి ఎత్తుకుంటూ "సాయంత్రం వస్తూనే డాక్టరు దగ్గరకెళ్ళి రిపోర్టు చూపించి మందులు తెచ్చెయ్యండి" అంటున్న వీణకు

"అలాగే" అనిచెప్పి బాబుకి టాటా చెప్తూ స్కూటర్ స్టార్ట్ చేశాడు మురళి.

పగలంతా వాడితో మరేమీ గొడవ లేదు. మధ్యాహ్నం దాకా హాయిగా ఆడుకొని, అన్నం తిని నిద్రపోయాడు వంశీ.

ఒంటి గంట ఔతూంటే మురళి కోసం ఎదురు చూస్తూ అతను రాగానే కలిసి భోజనంచేశారు.

భోజనం కాగానే అర్జంట్ పనుందంటూ వెళ్ళిపోయాడు మురళి.

తనూ బాబు పక్కన నడుం వాల్చి, నిద్రపట్టక బయటకొచ్చింది. ముందు వున్న స్థలంలో చిన్న తోట పెంచింది వీణ. మొక్కల మధ్య వున్న ఎండుటాకులు, కొమ్మలు ఊడ్చి కుప్ప చేసి ఆ చెత్తంతా కాల్చి ఆ బూడిదని మళ్ళీ చెట్లకే వేస్తుంది బలమని. వేరే పనేమీ లేక ఆ పని చెయ్యటం మొదలెట్టింది వీణ.

ఎప్పుడు లేచాడో వంశీ వచ్చి, మెట్ల మీద కూర్చుని శ్రద్ధగా చూస్తున్నాడు అమ్మ చేసే పనిని.

తనూ వచ్చి వాడి పక్కన కూర్చుంది.

"అమ్మా, ఊ?" ఏమిటి అన్నట్టు ఆ కుప్పని చూపించాడు వంశీ.

"చెత్తమ్మా, కాల్చేస్తే అంతా మాయమైపోతుంది. హుష్ కాకి" అన్నట్టు చెయ్యి తిప్పి చూపిస్తూ అంది వీణ.

ఏదో అర్థమైనట్టు బుర్ర ఊపాడు వాడు.

"నువ్విక్కడే వుండమ్మా" అని లోపలికెళ్ళి అగ్గిపెట్టె తెచ్చి అంటించింది. ఎప్పుడొచ్చాడో వంశీ ఆ కుప్ప దగ్గరగా వచ్చి అందులోకి విసిరేస్తున్నాడు అమ్మ నైటీని.

బాబూ అంటూ గభాల్న లాక్కుంది.

"తప్పమ్మా, అమ్మది కదా, పాడు చెయ్యొచ్చా?" అంది కోప్పడుతున్నట్టుగా.

"అమ్మా, అద్దూ, అద్దూ" మళ్ళీ అదే లాంటి ఏడుపు మొదలెట్టాడు వంశీ.

మబ్బు విడిపోయినట్టుగా అనిపించింది వీణకి.

బాబు ఏడుపుకి కారణం అర్థమైపోయింది.

ఔను. తను ఇంతకు ముందు నైటీలు వేసుకొనేది కాదు. ఈమధ్యే హాయిగా వుంటుంది అని అలవాటు చేసుకుంటోంది. కరెక్టే. బాబు ఆ రోజు నుంచే ఇట్లా చేస్తున్నాడు. రాత్రి అది వేసుకొన్న దగ్గర్నుంచీ మర్నాడు చీర కట్టుకునేదాకా అందుకే అమ్మా- వద్దూ అని ఏడుస్తున్నాడు.

అమ్మంటే వాడికి చీరలోనే కన్పించాలి.

అందుకే చీర కట్టుకోగానే సంతోషంగా తనని చుట్టేశాడు.

అది ఎట్లా చెప్తాలో వాడికి తెలియలేదు.

వాడి భాషలో చెప్పినా తాము అర్థం చేసుకోలేరు.

ఈ రోజు ఈ సంఘటన జరగకపోతే తన పలు తెల్సుకోగల్గేదేనా?

అందుకే ఏది జరిగినా మన మంచికే అంటారు.

సాయంత్రం మురళి వచ్చేసరికి చేటంత ముఖంతో ఎదురెళ్ళింది వీణ.

"సారీవోయ్, కొంచెం కాఫీ ఇస్తే తాగి డాక్టర్ దగ్గర కెళ్ళొస్తా" అంటున్నాడు మురళి.

"ఇంకే డాక్టరూ అక్కర్లేదూ" అంటూ జరిగినదంతా చెప్పింది వీణ మెరుస్తున్న కళ్ళతో.

"ఓరి భడవా, చిన్నప్పటి నుంచే నీ కిన్ని రిస్ట్రిక్షన్సా? అమ్మలో ఏ మార్పు వుండకూడదన్నమాట!" అంటున్న మురళితో అంది వీణ.

"పిల్లలకేమీ తెలియదు, వాళ్ళని ఊరికే మాయ చెయ్యవచ్చు అనుకోవడం మన మూర్ఖత్వం. నైటీలోని కొత్తరూపం వాడికి నచ్చలేదన్నమాట" అని.

—డి.అన్నపూర్ణ